ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 8 ఫిబ్రవరి 2024



స్పెయిన్ పర్యటన విజయవంతం

● రూ.3,440 కోట్ల పెట్టుబడులు సాధించాం
● ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



స్పెయిన్ నుంచి మీనంబాక్కం విమానాశ్రయానికి తిరిగొచ్చిన సీఎం స్టాలిన్‌ను గజమాలతో సత్కరిస్తున్న మంత్రులు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన దిశగా విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం నిర్వహించిన 12 రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతమైందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. బుధవారం ఉదయం స్పెయిన్ నుంచి తిరిగొచ్చిన స్టాలిన్ మీనంబాక్కం విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ... ఈ పర్యటనలో రూ.3440 కోట్ల మేరకు పెట్టుబడులను సాధించామని, ఆ మేరకు వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నామని చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో విదేశీ సంస్థలు తమిళనాట పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి కనబరిచినట్లు చెప్పారు. తన పర్యటనలో స్పెయిన్‌కు చెందిన ఆర్థిక రంగనిపుణులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, ఆ దేశ మంత్రులు, ఇన్వెస్ట్‌మెంట్ స్పెయిన్ సంస్థ నిర్వాహకులను కలుసుకుని సమగ్రంగా చర్చలు జరిపామన్నారు. విండ్‌మిల్లుల విద్యుత్ ఉత్పాదకత, నీటి రీసైక్లింగ్‌లో పేరుగడించిన ఆక్సీయానా సంస్థ, ఉన్నతమైన గృహనిర్మాణ పరికరాల ఉత్పత్తిలో, పింగాణీ వస్తువుల ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ రోక్కా, కంటైనర్ టెర్మినల్స్, గూడ్సు పార్కుల నిర్మాణంలో ప్రఖ్యాతిగాంచిన హబక్ లాయిడ్ కంపెనీ, అంతర్జాతీయ స్థాయిలో రహదారులను నిర్మించిన ఆబర్టిస్, మోటరు వాహనాల విడిభాగాల ఉత్పత్తిలో పేరుగాంచిన గెస్టాంప్, రైళ్ళకు సంబంధించిన అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే టాల్గో సంస్థ, ఇంజనీరింగ్ విద్యా శిక్షణకు సంబంధించిన సాంకేతిక పరికరాలు ఉత్పత్తి చేసే ఎడిపాన్ సంస్థ తదితర సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. హబాక్ లాయిడ్ సంస్థ రూ.2500 కోట్లు, ఎడిబాన్ సంస్థ రూ.540 కోట్లు, రోక్కా సంస్థ రూ.400 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత వీలయితే మళ్ళీ విదేశాల్లో పర్యటించి పెట్టుబడులు సేకరిస్తానని స్టాలిన్ పేర్కొన్నారు. ఇదిలా వుండగా విదేశాల నుంచి తిరిగొచ్చిన సీఎంకు ఆ పార్టీ నేతలు, మంత్రులు విమానాశ్రయంలో గజమాలతో సత్కరించి, స్వాగతం పలికారు.

ప్రజాసేవకు ఎవరొచ్చినా సంతోషమే

ప్యారీస్: ప్రజలకు సేవలందించేందుకు రాజకీయాల్లోకి ఎవరొచ్చినా సంతోషమేనని ఇటీవల కొత్త రాజకీయ పార్టీ ప్రారంభించిన నటుడు విజయ్‌ను ఆహ్వానిస్తున్నట్లు డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. విమానాశ్రయంలో బుధవారం విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎం స్టాలిన్ ఈ మేరకు సమాధానం చెప్పారు. పార్లమెంటుకు త్వరలో జరుగబోయే ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలోని పార్టీల నేతలతో సీట్ల సర్దుబాటు వ్యవహారం సజావుగా సాగుతోందని, ప్రజలు ఎప్పుడు ఎన్నికలు జరిగినా అభివృద్ధిని చూసే ఓటేస్తారని సీఎం తెలిపారు.

14 ఎంపీ సీట్లిచ్చే పార్టీతోనే పొత్తు

● డీఎండీకే చీఫ్ ప్రేమలత



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రేమలత

ప్యారీస్, ఫిబ్రవరి 7: పార్లమెంటు ఎన్నికల్లో 14 ఎంపీ సీట్లు, రాజ్యసభ సీటు ఇచ్చే పార్టీతోనే పొత్తు ఉంటుందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటించారు. కోయంబేడులోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శులు, నిర్వాహకులతో ప్రేమలత బుధవారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విజయకాంత్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. తర్వాత ప్రేమలత అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ప్రిసీడియం చైర్మన్ డాక్టర్ ఇళంగోవన్, ఉపకార్యదర్శులు ఎల్కే సుధీష్, పార్థసారథి, ప్రచార విభాగం కార్యదర్శి మోహన్‌రాజ్ సహా 82 జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు కుదుర్చుకోవాలి అన్న అంశంపై జిల్లా కార్యదర్శులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. కొంతమంది బీజేపీతో, మరికొందరు అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకోవాలని సలహాలిచ్చారు. సమావేశంలో పాల్గొన్న నేతలందరూ తమ అభిప్రాయాలను తెలియజేసిన అనంతరం పది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. విజయకాంత్ అంత్యక్రియల్లో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం ఆమోదించారు. విజయకాంత్ సమాధిని ఆలయంగా నిర్మించాలని, ఈ నెల 12వ తేది అన్ని జిల్లాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎవరితో పొత్తు కుదుర్చుకోవాలి, అభ్యర్థుల ఎంపిక అధికారాన్ని ఈ సమావేశం ప్రేమలతకు అప్పజెప్పింది.

అధిక స్థానాలు...

సమావేశం అనంతరం ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ... 2014 పార్లమెంటు ఎన్నికల్లోలాగే డీఎండీకేకు అధిక స్థానాలు కేటాయించే పార్టీలతోనే కూటమి ఉంటుందని, ఈనెల 12వ తేదిలోపు పొత్తుల ఖరారుపై అధికారపూర్వకంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు పార్టీలతో సీట్ల పంపకంపై ప్రసారమయ్యే కథనాల్లో వాస్తవం లేదని, తమ పార్టీ ఎవరితోనూ పొత్తు గురించి సంప్రదింపులు జరపలేదన్నారు. పార్లమెంటుకు జరుగనున్న ఎన్నికల్లో తాము కోరిన 14 ఎంపీ సీట్లు, ఒక రాజ్యసభ సీటు కేటాయించే పార్టీతో పొత్తు ఉంటుందని, తమ పార్టీ సిద్ధాంతాల వల్ల డీఎండీకేకు ప్రజాదరణతో పాటు ఓటు బ్యాంక్ కూడా పెరిగిందన్నారు. కొత్త పార్టీ ప్రారంభించిన నటుడు విజయ్‌ను ఆహ్వానిస్తూ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన సీఈసీ సమాలోచనలు

● పాల్గొన్న కలెక్టర్లు - ఎస్పీలు

అడయార్, ఫిబ్రవరి 7: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్ల కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన ఇద్దరు ఉన్నతాధికారుల బృందం రెండోరోజైన బధవారం కూడా సమాలోచనలు జరిపింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఇతర ఉన్నతాధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘానికి చెందిన ఎన్నికల కమిషనర్ అయ్ బదూ సారథ్యంలోని బృందం మంగళవారం ఢిల్లీ నుంచి నగరానికి వచ్చి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రెండోరోజైన బుధవారం సమావేశమైంది. కలెక్టర్లు, ఎస్పీలతో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ ఇతర ఉన్నతాధికారుల సమావేశానికి హాజరయ్యారు. ఇందులో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వారు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను ఎపుడు నిర్వహించాలన్న తేదీ గురించి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టంగా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీలకు సూచించారు. కాగా, ఈ ఎన్నికల బృందం రెండు రోజుల తన పర్యటనను ముగించుకుని బుధవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లింది.

ఇప్పట్లో పార్టీ స్థాపన లేదు

● భవిష్యత్తు కాలగమనం మేరకు నిర్ణయం
● ప్రజల్లో ఒకరిగా గళం వినిపిస్తానని ప్రకటన
● నటుడు విశాల్



అడయార్, ఫిబ్రవరి 7: తాను రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు జరుగుతున్న ప్రచారానికి సినీ హీరో విశాల్ ఫుల్‌స్టాప్ పెట్టారు. అయితే, భవిష్యత్తులో ఏదేని నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి వస్తే ప్రజల్లో ఒకరిగా, ప్రజల కోసం గళం వినిపిస్తానని ఆయన బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సమాజంలో కొన్నేళ్లుగా నటుడిగా, వ్యక్తిగా, సమాజ సేవకుడిగా తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలతో పాటు హోదా ఇచ్చిన రాష్ట్ర ప్రజానీకానికి ఎన్నటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. గత కొంతకాలంగా తనకు సాధ్యమైనంత మేరకు సాయం చేసేందుకు ఏర్పాటు చేసిన తన అభిమాన సంఘం.. సాదాసీదాగా ఉండరాదన్న భావనలో ప్రజలకు వివిధ రూపాల్లో చేయూత అందిస్తున్నట్టు తెలిపారు. అంతేకాకుండా, తన తల్లి పేరుతో దేవి చారిటబుల్ ట్రస్ట్‌తో పాటు మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం పేరుతో పేద పిల్లల విద్యాభ్యాసం కోసం సాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా, విశాల్ మక్కల్ ఇయ్యకాన్ని రాష్ట్ర, అసెంబ్లీ, విభాగాల స్థాయిలో విస్తరించడమే కాకుండా, తన తల్లిపేరుతో స్థాపించిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తన వంతు సాయం చేస్తున్నట్టు గుర్తుచేశారు. అలాగే షూటింగుల కోసం తాను వెళ్లే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలను కూడా కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పనుల చేయడం వెనుక ఎలాంటి రాజకీయ లబ్ధిని ఆశించడం లేదన్నారు. తన శక్తిమేరకు సాయం అందజేస్తూనే ఉంటానని వెల్లడించారు. ఇపుడు మక్కల్ ఇయ్యక్కం తరపున చేస్తున్న పనులు యథావిధిగా కొనసాగుతాయని, భవిష్యత్తులో నిర్ణయం తీసుకోవాల్సివస్తే అపుడు ప్రజల్లో ఒకడిగా, ప్రజల కోసం గళం వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు.



23న కార్పొరేషన్ బడ్జెట్ దాఖలు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ ఈ నెల 23వ తేదీన దాఖలు చేయనున్నారు. ప్రస్తుతం మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. గతేడాది కార్పొరేషన్ బడ్జెట్‌లో ఆదాయం రూ.4,131.70 కోట్లకుగాను, రూ.4,466.29 కోట్లను వ్యయంగా చూపెట్టారు. మూలధన రాబడి రూ.3554.50 కోట్లుగా చూపారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సమర్పించనున్న బడ్జెట్ కూడా లోటుబడ్జెట్‌గానే ఉంటుందని కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌ను పన్నుల విధింపు ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు సర్‌బజయా దాస్ దాఖలు చేయనున్నారు.

సిటీ బస్సుల్లో మగవారికీ ఉచిత ప్రయాణం

● పీఎంకే నేత అన్బుమణి రాందాస్ డిమాండ్

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిటీ బస్సుల్లో మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం తగదని, మగవారికి కూడా కల్పించాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. స్టెల్లా మేరీస్ కళాశాలలో బుధవారం ఉదయం వాతావరణంలో పెనుమార్పులు, సామాజిక సమానత్వం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. చెన్నైలో ప్రస్తుతం 3,500 బస్సులు మాత్రమే నడుపుతున్నారని, వాటి సంఖ్యను 8 వేలకు పెంచాలని, మగవారికి ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. చెన్నైలో యేటా వాయుకాలుష్యానికి వందలాదిమంది మృతి చెందుతున్నారని, కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సదస్సు ముగిసిన తర్వాత ఆ కళాశాలలోనే చదువుకున్న అన్బుమణి రాందాస్ సతీమణి సౌమ్యా అన్బుమణి, కుమార్తె సంజుత్ర, విద్యార్థినులతోపాటు నిలిచి సెల్ఫీ తీసుకున్నారు.



స్టెల్లా మేరీస్ కాలేజీ విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న అన్బుమణి రాందాస్, ఆయన సతీమణి సౌమ్యా అన్బుమణి, కుమార్తె

21న మరోసారి రవాణా సంఘాల కార్మికులతో చర్చలు

పెరంబూర్, ఫిబ్రవరి 7: డిమాండ్ల పరిష్కారం రవాణా కార్మిక సంఘాల నేతలతో ఈనెల 21న మళ్లీ చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 15వ వేతన కమిషన్ ఒప్పందం, రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు డీఏ పెంపు సహా పలు డిమాండ్లతో ప్రభుత్వ రవాణా సంస్థ కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె హైకోర్టు జోక్యంతో తాత్కాలికంగా వెనక్కు తీసుకోగా, కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వ చర్చలు జరుపుతోంది. ఇప్పటికే జరిపిన రెండు విడత చర్చలు విఫలం కాగా, 3వ విడత చర్చలు బుధవారం స్థానిక డీఎంఎస్ ప్రాంగణంలోని కార్మిక సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ నేతృత్వంలో జరిగాయి. ఈ చర్చల్లో సీఐటీయూ, అన్నా కార్మిక సంఘం, ఏఐటీయూసీ సహా 27 కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చర్చల్లో కూడా ఎలాంటి పురోగతి లేకపోవడంతో, తదుపరి చర్చలు ఈ నెల 21వ తేది జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయమై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్ మాట్లాడుతూ.. ప్రధానంగా మాజీ ఉద్యోగుల సమస్యలపై చర్చించామన్నారు. అలాగే, వేతన ఒప్పందంపై కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపిందని, 21న జరిగే చర్చల్లో ఫలితం ఉంటుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పొత్తుకోసం ఎవరినీ ఒత్తిడి చేయం

అమిత్‌షా వ్యాఖ్యలు అన్నాడీఎంకేని ఉద్దేశించినవి కావు

చివరి క్షణంలో ఏవైనా జరగొచ్చు ● ఢిల్లీలో అన్నామలై ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయేలో చేరాలంటూ ఏ పార్టీనీ తాము ఒత్తిడి చేసే ప్రసక్తే లేదని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అన్నాడీఎంకేని ఉద్దేశించినవి కావని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రులు ఎల్.మురుగన్, చంద్రశేఖర్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో 14 మంది అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యులు, ఓ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... చివరి క్షణంలో ఏవైనా జరగవచ్చునని, డీఎంకే మిత్రపక్షాలలో కొన్ని తమ కూటమిలో చేరినా వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. జాతీయ స్థాయిలో ఎన్డీయేని నెలకొల్పిందని బీజేపీయేనని, ఆ కూటమిలో ఏ పార్టీయైనా చేరవచ్చు, నచ్చకుంటే వెళ్లిపోవచ్చన్నారు. పార్టీలను బీజేపీ నిర్బంధించే ప్రసక్తే ఉండదన్నారు. తమ కూటమిలో అన్నాడీఎంకే సహా ఏ పార్టీలైనా చేరేందుకు తలుపులు తెరచే ఉంచామంటూ మంగళవారం ఢిల్లీలో ఓ తమిళ పత్రికకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. అమిత్‌షా... అన్నాడీఎంకేని మాత్రమే కూటమిలో చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామనే భావనతో ఆ వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. అన్నాడీఎంకే సహా ఎన్ని పార్టీలైనా తమ కూటమిలో చేరేందుకు తలుపులు తెరిచే ఉంచామని అమిత్‌షా చెప్పారని అన్నామలై వివరణ ఇచ్చారు.



ఢిల్లీలో కేంద్రమంత్రులు మురుగన్, చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి సమక్షంలో మీడియాతో మాట్లాడుతున్న అన్నామలై

మోదీకి మద్దతిచ్చే పార్టీలు చేరొచ్చు...

భారత ప్రధానిగా మూడోసారి నరేంద్రమోదీ గెలిచేందుకు మద్దతు పలికే పార్టీలు ఎన్డీయేలో చేరవచ్చని అన్నామలై చెప్పారు. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలంతా మోదీ మూడోసారి ప్రధానిగా రావాలని కోరుకుంటూ ఓటు వేయనున్నారని తెలిపారు. తమ పార్టీకి సంబంధించినంత వరకు మైనార్టీలు, మెజార్టీలు అంటూ ఎలాంటి తారతమ్యాలను ప్రదర్శించడం లేదని, దేశ ప్రజలంతా అభివృద్ధి చెందాలని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ విదేశ పర్యటనలో 4వేల కోట్లకు పైగా పెట్టుబడులు సమీకరించినట్లు చెప్పుకోవడం గర్హనీయమన్నారు. ఇప్పటివరకూ మూడుసార్లు స్టాలిన్ విదేశీ పర్యటనలు జరిపారని, కోట్లాది రూపాయల మేరకు పెట్టుబడులు సమీకరించినట్లు లెక్కలు మాత్రమే చెబుతున్నారు తప్ప వాస్తవానికి రాష్ట్రంలో కొత్త పరిశ్రమలేవీ నెలకొల్పలేద న్నారు. స్టాలిన్ విదేశీ పర్యటనలలో పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు, వాటి వల్ల రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమలు తదితర వివరాలతో సమగ్రంగా రాష్ట్ర ప్రభుత్వం ఓ శ్వేతపత్రం జారీ చేయాలని అన్నామలై డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పొన్ రాధాకృష్ణన్, వానతి శ్రీనివాసన్, నయినార్ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

మా పార్టీ తలుపులు

మీ కోసం తెరవం!

● బీజేపీ నేతలకు అన్నాడీఎంకే కౌంటర్



చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో తెగతెంపులు చేసుకుని ఎన్నో నెలలు దాటాయని, మళ్లీ ఎన్డీయే కూటమిలో చేరే ప్రసక్తి లేదని అన్నాడీఎంకే నేతలు ఆ పార్టీ జాతీయ నేతలకు కౌంటర్ ఇచ్చారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా... ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు తమ కూటమిలో చేరేందుకు తలుపులు తెరిచే ఉంచామని పేర్కొనడంపై అన్నాడీఎంకే నేతలు తీవ్రస్థాయిలో స్పందించారు. మాజీ మంత్రి డి.జయకుమార్ బుధవారం ఉదయం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ... పార్టీ శ్రేణులంతా బీజేపీతో పొత్తు పెట్టుకోకూడదని ఒత్తిడి చేయడం వల్లే ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఆ కూటమిలో ఎలా చేరుతామని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన పార్టీ వివిధ విభాగాలకు చెందిన నిర్వాహకుల సమావేశాల్లోనూ బీజేపీ వైపు కన్నెత్తి చూడకూడదని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అన్నాడీఎంకే దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత కీర్తి ప్రతిష్ఠలను కించపరిచే విధంగా అన్నామలై, బీజేపీ జాతీయ నాయకులు పదేపదే విమర్శలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే బలీయమైన రాజకీయ శక్తి అని, తమ పార్టీకి రెండు కోట్ల మందికి పైగా సభ్యులున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా అన్ని సీట్లుగెలుచుకునే సత్తా తమకు ఉందన్నారు.

నో కామెంట్...

ఇదిలా ఉండగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ... అన్నాడీఎంకే కోసం బీజేపీ తలుపులు తెరచి ఉన్నాయంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తానింకా చూడలేదని తెలిపారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాత ఈ విషయమై ప్రకటన చేస్తానని చెప్పారు. ప్రస్తుతానికి ఎన్డీయేలో అన్నాడీఎంకే లేదని, లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగి తీరుతుందని ఈపీఎస్ స్పష్టం చేశారు.

నిధుల కేటాయింపులో కేంద్రం పక్షపాతం

● డీఎంకే ఎంపీ కనిమొళి

పెరంబూర్, ఫిబ్రవరి 7: దక్షిణాది రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోందని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శించారు. డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, ఎంపీ కనిమొళి నేతృత్వంలోని పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ సేకరిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బుధవారం మదురైలో సమావేశమైంది. ఇందులో మదురై, శివగంగ, తేని, దిండుగల్ తదితర జిల్లాల పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కనిమొళి మీడియాతో మాట్లాడుతూ..మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై అన్ని వర్గాల ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలను నమోదు చేసుకుంటున్నామని చెప్పారు. జీఎస్టీతో ఇబ్బంది పడుతున్నట్టు సూక్ష్మ, చిన్న పరిశ్రమల యజమానులు తెలిపారన్నారు. తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిందని, కానీ బీజేపీ నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. విద్యారంగానికి కూడా కేంద్రం నిధులు తగ్గించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రకృతి విపత్తులకు గురై తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి ఒక్క పైసా కూడా కేంద్రం నుంచి రాలేదన్నారు. తుఫాను, భారీవర్షాలకు నష్టపోయిన చెన్నై, దక్షిణ జిల్లాల్లో సీనియర్ కేంద్రమంత్రులు పర్యటించినా, నిధులు మాత్రం అందించలేదని తెలిపారు. రైల్వే సహా పలు రంగాల్లో దక్షిణ రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం పక్షపాతం చూపుతూ, అతి తక్కువ నిధులు కేటాయించిందని కనిమొళి చెప్పారు.



ప్రజాభిప్రాయ సేకరణలో కనిమొళి

అత్తికడవు నీటి పథకాన్ని రాజకీయం చెయ్యొద్దు

● మంత్రి ముత్తుస్వామి

ప్యారీస్, ఫిబ్రవరి 7: అత్తికడవు నీటి పథకాన్ని ప్రారంభించడం ఇప్పట్లో సాధ్యం కాదని, ప్రతిపక్షాలు దీనిపై రాజకీయం చేయొద్దని రాష్ట్రప్రభుత్వ గృహవసతి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. కోయంబత్తూర్ సమీపంలోని వయ్యంపాళయంలో తమిళనాడు రైతు సంఘ వ్యవస్థాపకుడు నారాయణస్వామి నాయుడు స్మారక మందిరంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంగళవారం మంత్రి ముత్తుస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అత్తికడవు - అవినాశి నీటి పథకానికి అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మూడు పంపింగ్ స్టేషన్లకు అవసరమైన భూములను సేకరించిందని అయితే, ఈ భూములిచ్చిన వారికి నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. అయినప్పటికీ, నీటి పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, రైతుల ఇళ్లకే వెళ్లి వారితో మాట్లాడి పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అదే సమయంలో ఈ ప్రాంతంలోని చెరువుకు నీరు చేరడం లేదన్నారు. ఏర్పాటు చేసిన ఆరు మోటర్లలో మూడింటిలో కూడా పూర్తిస్థాయిలో నీటిని పంప్ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కనీసం నాలుగు మోటర్ల ద్వారా పూర్తిస్థాయిలో నీటిని పంపింగ్ చేస్తే మాత్రమే ఈ పథకం సాధ్యమవుతుందన్నారు. చెరకు రైతులకు ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యం నిలువ ఉంచిన బాకీ మొత్తాన్ని సంబంధిత జిల్లాల కలెక్టర్లను సంప్రదించి పొందవచ్చన్నారు.

తమిళనాడు - పుదుచ్చేరి నిర్వాహక డైరెక్టర్‌గా అన్నాదురై

ప్యారీస్, ఫిబ్రవరి 7: తమిళనాడు - పుదుచ్చేరి రాష్ట్రాల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) నిర్వాహక డైరెక్టర్‌గా ఎం.అన్నాదురై బాధ్యతలు స్వీకరించారు. కేంద్రప్రభుత్వ పబ్లిక్ రంగ సంస్థల్లో ఒకటైన ఐఓసీ పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాలు వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో, తమిళనాడు - పుదుచ్చేరి రాష్ట్రాల ఛైర్మన్‌గా ఇంధనం చిల్లర విక్రయాలు, విమాన రవాణా శాఖల్లో అనుభవం గడించిన ఎం.అన్నాదురై, స్థానిక గిండి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానిల్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. అలాగే, మద్రాసు యూనివర్శిటీలో ఫైనాన్స్ విభాగంలో ఎంబీఏ డిగ్రీ అందుకున్నారు.

విడుదలైన ఖైదీకి సరుకుల అందజేత



వేలూరు, ఫిబ్రవరి 7: అన్నా జయంతి సందర్భంగా వేలూరు సెంట్రల్ జైల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న కృష్ణగిరి జిల్లా కేలమంగళం సమీపం చిన్నాటి గ్రామానికి చెందిన శ్రీనివాసన్ (55) బుధవారం విడుదలయ్యాడు. ఆయనకు తమిళనాడు మాజీ ఖైదీల సంక్షేమ సంఘం తరఫున బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు, న్యాయవాది విజయ రాఘవులు, జైలు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్, సెక్రటరీ జనార్దనన్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 7: స్థానిక తందై పెరియార్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయను న్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవా రం పరిశీలించారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను ఈ కళాశాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచి, తదుపరి లెక్కింపు చేపట్టనున్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ఎస్పీ తిరునావుక్కరసు, పీడబ్ల్యూడీ ఇంజనీర్ జయరామన్, రెవెన్యూ తహసీల్దార్లు, బీడీఓలు ఉన్నారు.

కాట్పాడి తిరునగర్‌లో 'అన్నై మెస్' ప్రారంభం



మెస్ ప్రారంభిస్తున్న ఎస్సార్కే అప్పు

వేలూరు, ఫిబ్రవరి 7: స్థానిక కాట్పాడి తిరునగర్ ప్రాంతంలోని వివేకానంద వీధిలో అన్నై మెస్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నా డీఎంకే మా నగర జిల్లా సెక్రటరీ అప్పు పాల్గొని రిబ్బన్ కత్తిరించారు. అమ్మా ఇయక్కం సెక్రటరీ రమేష్, యూనియన్ సెక్రటరీ నాగరాజన్, రాజ శివశక్తి క్యాటరింగ్ సర్వీస్ యజమాని ఆల్బర్ట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రాంతాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవచ్చు

● హైకోర్టుకు తెలిపిన సర్కారు

అడయార్, ఫిబ్రవరి 7: ప్రైవేటు బస్సులు సూరాపట్టు, పోరూర్, తాంబరం ప్రాంతాల్లో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు, పెరుంగళత్తూరులో దించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మద్రాస్ హైకోర్టుకు అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్ తెలిపారు. కొత్తగా నిర్మించిన కీలంబాక్కం బస్టాండు నుంచి కాకుండా, నగరంలోని కోయంబేడు బస్టాండు నుంచే ప్రైవేటు బస్సులు బయలుదేరివెళ్లేలా ప్రభుత్వం అనుమతిఇచ్చేలా ఆదేశించాలనికోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం మరోమారు న్యాయమూర్తి ఎన్ఆర్ మంజుల సమక్షంలో విచారణ జరిగింది. ఆ సమయంలో ఏజీ పీఎస్ రామన్ హాజరై పైన పేర్కొన్న మూడుప్రాంతాల్లో ప్రైవేటుబస్సులు ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కోర్టుకు తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

రాష్ట్రానికి 22 వేల టన్నుల 'భారత్' బియ్యం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: రాష్ట్రానికి 22 వేల టన్నుల భారత్ బియ్యాన్ని తొలివిడతగా కేంద్రప్రభుత్వ కేటాయించింది. మార్కెట్లో బియ్యం ధరలు పెరగడంతో 'భారత్ రైస్' పేరుతో కిలో రూ.29కి విక్రయించేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ వ్యవసాయ సహకార సంఘాల ద్వారా బియ్యం విక్రయాలు ప్రారంభించింది. దిగుమతి అయిన బియ్యాన్ని త్వరలో 5,10 కిలోల బస్తాలుగా వ్యాన్లలో తరలించి సహకార దుకాణాల ద్వారా విక్రయించనున్నారు.

రాణిపేట సీఎంసీలో ప్రత్యేక సదుపాయాలు ప్రారంభం



హెల్త్ చెకప్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

వేలూరు, ఫిబ్రవరి 7: మాస్టర్ హెల్త్ చెకప్ క్లినిక్, వేలూరు సీఎంసీ రాణిపేట ఆవరణలో మాస్టర్ హెల్త్ చెకప్ క్లినిక్, డీజీ హెల్త్ చెకప్ అసిస్ట్ కియోస్క్ బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మంత్రులు మెయ్యనాథన్, గాంధీ, ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ పాల్గొని, ఈ సేవలను ప్రజలు అందుబాటులోకి తీసుకొచ్చారు. మాస్టర్ హెల్త్ చెప్ పథకాన్ని రాణిపేట ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వైద్య సూపరింటెండెంట్ రాజేష్ కోరారు.

ఐసిఎఫ్‌కు రూ.13,872 కోట్లు కేటాయింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: చెన్నై ఐసిఎఫ్ కర్మాగారానికి రూ.13,872 కోట్లను కేంద్రప్రభుత్వం కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాలానుకులంగా ఆధునిక బోగీలు, పర్యాటక, ఆర్మీ రైలు, మెట్రో రైలు వంటి 75 రకాల రైలు పెట్టెలు ఐసిఎఫ్‌లో తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఇక్కడ తయారైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వందే భారత్, అమృత్‌భారత్ రైళ్లు, సాధారణ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, ఎలక్ట్రిక్ రైలుపెట్టెలు వంటివి తయారు చేయడానికి వినియోగిస్తామని, మిగిలిన నిధులతో ఐసిఎఫ్ కాంప్లెక్స్ ప్రాంగణం, క్వార్టర్స్ అభివృద్ధి పనులకు వినియోగిస్తామన్నారు.

ఎన్ఎల్‌సీ నికర లాభం రూ.1,673 కోట్లు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా సంస్థ నికర లాభాలు 253 శాతం పెరిగి రూ.1,673 కోట్లకు చేరిందని ఆ సంస్థ ప్రకటించింది. పన్ను చెల్లింపునకు ముందు నికర లాభం రూ.2566 కోట్లుగా ఉండేదని పేర్కొంది. మునుపటి ఆర్థిక సంవత్సరంలో సంస్థ నికర లాభం రూ.474 కోట్లని తెలిపింది. ఎన్ఎల్‌సీ గ్రూపు నికర లాభం 197 శాతం పెరిగి రూ.1,754 కోట్లకు చేరిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సం మూడో త్రైమాసికంలో గ్రూపు నికర లాభం రూ.690 కోట్లు నమోదైందని వివరించారు. పన్నుల చెల్లింపునకు ముందు గ్రూపు నికర లాభం 240 శాతం పెరిగి రూ.2,716కోట్లకు పెరిగిందని వివరించారు. గత నవంబర్ 4న ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ అనుబంధంగా ఉన్న ఎన్‌యూపీపీఎల్ ఘటంపూర్ థర్మల్ పవర్‌స్టేషన్‌లో 660 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1తో అనుసంధానం చేయబడిందన్నారు. ఇక ఎన్ఎల్‌సీఐఎల్ గనుల విభాగానికి గత డిసెంబర్ 20 కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిత్వశాఖ 13స్టార్ రేటింగ్‌ను ప్రదానం చేసిందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15 శాతం తాత్కాలిక డివిడెండ్ ప్రకటించినట్లు తెలిపారు.

వేంగైవాయల్ కేసును సీబీఐకి బదిలీ చేయాలి

● జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ రవివర్మన్

ప్యారీస్, ఫిబ్రవరి 7: వేంగైవాయల్ కేసును సీబీఐకి బదిలీ చేయాలని బాధిత ప్రజలు కోరుతున్నట్లు జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ రవివర్మన్ పేర్కొన్నారు. వేంగైవాయల్ గ్రామంలో దళిత కుటుంబాలు వినియోగించే తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు కలిపిన వారిని గుర్తించి శిక్ష విధించాలని కోరుతూ వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో, బాధిత ప్రజలను రవివర్మన్ సోమవారం సంప్రదించి విచారణ ఏ స్థాయిలో సాగుతోందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.... సీబీసీఐడీ అధికారుల విచారణ తృప్తికరంగా లేదని, అదే విధంగా డీఎన్ఏ రక్తపరీక్షలు జరపడం సరికాదన్నారు. లై డిటెక్టర్ పరీక్షతో వాస్తవాలను తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, ఇందుకు బాధ్యులైన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫా ఉండదని ఈబీ తెలిపింది.

● **తాంబరం:** కడప్పేరి ఎస్‌బీఐ కాలనీ, ఎంఐటీ గేట్, జీఎస్‌టీ సర్వీస్ రోడ్డు, రాధా నగర్, నెహ్రూ నగర్, పాత హస్తినాపురం, పార్వతి ఆసుపత్రి, రామమూర్తి వీధి, కిడ్స్ పార్క్, గణపతిపురం, వరదరాజపురం, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, కరుమారియమ్మన్ నగర్, జీవా నగర్, రాధా నగర్, పురుషోత్తమన్ నగర్, సుందరరాఘవమ్మాళ్ కాలనీ, పద్మనాభ నగర్, ఎన్జీవో కాలనీ, నేతాజీ నగర్, జైన్ నగర్, గంగైయమ్మన్ నగర్, తిరుపోరూర్ రోడ్డు

● **అడయార్:** ఐఐటీ గాంధీ మండపం రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డు, కోట్టూరుపురం, శ్రీనగర్ కాలని, చిన్నమలై, తరమణి, కానగం, కలికుండ్రం, పళ్లిపట్టు, గోవిందరాజపురం, భక్తవత్సలం నగర్ 1 నుంచి 5వ రోడ్డు వరకు, బీసెంట్ నగర్ 1,2,3 వీధులు, సీవర్డ్ రోడ్డు, బాలకృష్ణ రోడ్డు, జయరాం నగర్, కుప్పం బీచ్ రోడ్డు, రాజగోపాలన్ మెయిన్ రోడ్డు, టీచర్స్ కాలని, వేంబులియమ్మన్ ఆలయ వీధి, కొట్టివాక్కం కేకే రోడ్డు, భారతి అవెన్యూ, కావేరి నగర్, ఏజీఎస్ కాలని, న్యూ కాలనీ, వర్శిటీ నగర్, ఈసీఆర్

● **ఐటీ కారిడార్:** దురైపాక్కం ఓఎంఆర్ రోడ్డు ఈస్ట్, ఇందిరా గాంధీ వీధి, నటేశన్ కాలని, షోళింగనల్లూర్, ఈశ్వరన్ రోడ్డు, మణిమేఘలై నగర్, మెగా టీవీ, ఓఎంఆర్ వెస్ట్ ఏరియా, ఎల్ అండ్ టీ సిరుచేరి విలేజ్, కారనై విలేజ్. ● **గిండి:** నంగనల్లూర పీవీ నగర్, ఎంజీఆర్ రోడ్డు, కనకాంబాళ్ కాలనీ, గాంధీ రోడ్డు, వేళచ్చేరి మడిపాక్కం, రామ్ నగర్ నార్త్, సౌత్ వీధులు, బజార్ నగర్, శ్రీనివాస్‌నగర్, గోమతి నగర్, తిరుజ్ఞానసంబంధర్ వీధి

● **కేకే నగర్:** ఆళ్వార్‌తిరునగర్, కనకాధర నగర్, విజయా నగర్, గంగై అమ్మన్ ఆలయ వీధి, తిరుపతినగర్, వలసరవాక్కం పోలీస్‌స్టేషన్, ఎస్వార్ ఎంసీజీకే ఎస్టేట్, లక్ష్మీనగర్, ద్రవ్యం నగర్, సప్తగిరి, చిన్న పోరూర్

● **పోరూర్:** మంగళా నగర్, అంబాళ్ నగర్, మౌంట్ పూందమల్లి రోడ్డు, ఆర్ఈ నగర్, వన్నియర్ వీధి, కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, ఎంఎస్ నగర్, సెంథిల్ నగర్, బెల్ నగర్, శ్రీ జయేంద్ర సరస్వతి నగర్, అమ్మన్ నగర్, సత్యనారాయణ పురం, పొన్నియమ్మన్ ఆలయ వీధి, మాంగాడు గణపతినగర్, హరి అవెన్యూ, అష్టలక్ష్మి నగర్, ముత్తుస్వామి నగర్, మంగళాపురం, సిక్కరాయపురం, భాగ్యం నగర్, కోవూర్ కుమరన్ నగర్, ఆర్ముగం నగర్, మణికంఠ నగర్, మేల్మా నగర్, ఇరండాంకట్టలై, రెడ్డి వీధి, ముడిచూర్ భరద్వాజ్ నగర్, ధనసెల్వి నగర్, పీటీసీ క్వార్టర్స్, వరదరాజపురం, దర్గా రోడ్డు, నడువీరపట్టు, అయ్యప్పన్‌తాంగళ్ మెయిన్ రోడ్డు, ఆర్ఆర్‌నగర్, తిరువేర్కాడు, కన్నపాళయం, పాలివాక్కం, కుప్పత్తుమేడు, ఐల్‌చేరి

● **అంబత్తూర్:** తిరువేర్కాడు సుందర చోళపురం, రామ్ నగర్, ఆర్ఎంకే లోటస్ అవెన్యూ, చిన్నకోలడి ఎస్టేట్ 1,2 మెయిన్ రోడ్డు, మొగప్పేర్ ఎస్టేట్, సౌత్ అవెన్యూ, రెడ్డి వీధి, కవరై వీధి, కల్యాణి ఎస్టేట్

● **రెడ్‌హిల్స్:** సోత్తుపెరుంబేడు, అల్లిమేడు, వరక్కాడు, పాలయం, అరుమందై, మారంబేడు, అంగాడు, వెల్లివాయల్

● **తండయార్‌పేట:** గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, సోలయప్పన్ వీధి, కప్పల్‌పోలు వీధి, వీటీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, శ్రీరంగమ్మాళ్ వీధి, రామానుజం వీధి, సంజీవరాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలు ముదలి వీధి, పాత వాషర్‌మెన్‌పేట.

సమాచార దర్శిని

10 నుంచి వర్షాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: డెల్టా, దక్షిణ జిల్లాల్లో ఈ నెల 10వ తేది నుంచి మూడు రోజులు మోస్తరు వర్షాలు కురవనున్నట్లు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిల్లో ఈనెల 9వ తేది వరకు పొడి వాతావరణం నెలకొంటుందని, 10వ తేదీ నుంచి 12 వరకు కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. చెన్నై మేఘావృత్తమై ఉంటుందని, వేకువజామున స్వల్పంగా మంచు కురుస్తుందని తెలిపింది. ఇక పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని పేర్కొంది.

జీకేఎం కాలనీ శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, ఫిబ్రవరి 7: స్థానిక తిరువికనగర్ మండలం 64వ వార్డు పరిధిలోని జీకేఎం కాలనీ శ్మశానవాటికలో ఎల్పీజీ దహనవాటికలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈనెల 7నుంచి 29వ తేది వరకు మూసివేయనున్నారు. ఆ రోజుల్లో ప్రజలు 66వ వార్డు పరిధిలోని నేర్మై నగర్, 67వ వార్డు పరిధిలోని తాంగళ్ శ్మశానవాటికలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ తెలియజేసింది.

నేటినుంచి కంప్యూటర్ తమిళ మహానాడు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కంప్యూటర్ తమిళ్-24 మహానాడు గురువారం నుంచి నగరంలో మూడు రోజులు జరగనుంది. చెన్నై వర్తక కేంద్రంలో జరిగే ఈ మహానాడులో అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, స్విట్జర్లాండ్, శ్రీలంక వంటి దేశాల నుంచి భాషా పండితులు, గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థల సాంకేతిక నిపుణులు పాల్గొననున్నారు. భాషా నమూనాలు, యంత్రాల ద్వారా బోధనా విధానం, కృత్రిమ మేథ వంటి శీర్షికల్లో 50కి మందికి పైగా నిపుణుల ఉపన్యాసాలు, బృందాల విభాగాలు మహానాడులో ఉంటాయి.

వందే భారత్ రైల్లో ఇకపై 500 ఎంఎల్ వాటర్ బాటిళ్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: వందే భారత్ రైళ్లలో ప్రయాణికులకు ఇకపై 500 మి.లీ వాటర్ బాటిళ్లు అందించనున్నట్టు రైల్వే బోర్డు అధికారులు తెలిపారు. ఈ రైలు ప్రయాణికులకు లీటరు రైల్ నీర్ బాటిల్‌ను ఉచితంగా అందిస్తుండగా, కొందరు ప్రయాణికులు సగం తాగిన బాటిళ్లను చెత్తకుండీలో పడేస్తున్నారు. నీరు వృథా కావడాన్ని అడ్డుకొనేలా ఇకపై అర లీటర్ బాటిళ్లు అందజేయాలని అన్ని మండల మేనేజర్లకు రైల్వే బోర్డు సర్క్యులర్ పంపింది. అవసరమైతే ఉచితంగా మరో బాటిల్ అందించాలని సూచించింది.

ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామకం

ప్యారీస్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ రంగ సంస్థలు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను నియమించేందుకు ఓవర్సీస్ ఉపాధి కల్పన కేంద్రాన్ని సంప్రదించవచ్చని ఆ సంస్థ ఛైర్మన్ మహేశ్వరన్ పేర్కొన్నారు. ఓవర్సీస్ సంస్థ ద్వారా విదేశాల్లోని పలు సంస్థల్లో అందుబాటులో ఉన్న పారిశుధ్య కార్మికులు, వాటర్ కొరియర్, వాచ్‌మెన్, గార్డనర్, వంట మనుషులు, డ్రైవర్లు, లిఫ్ట్ ఆపరేటర్లు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, సీసీ టీవీ ఆపరేటర్లు, స్టెనోగ్రాఫర్, టైపిస్ట్ తదితర పోస్టులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు తమిళనాడు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు. ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థలు జాబ్ మేళా నిర్వహించి ఔట్ సోర్సింగ్ విధానంలో విదేశాలకు అవసరమైన ఉద్యోగులను నియమించుకోవచ్చని తెలిపారు. అందుకోసం www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చన్నారు.

అరుణాచలేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.2.81 కోట్లు

అడయార్, ఫిబ్రవరి 7: తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ2.81 కోట్లుగా వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయానికి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఇందులో రూ.2,81,61,823 నగదు రూపంలో వచ్చింది. అలాగే, 154 గ్రాముల బంగారం, 1.242 కిలోల వెండిని భక్తులు సమర్పించారు. విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు.

రంజీ క్రికెట్ మ్యాచ్‌కు ప్రవేశం ఉచితం

పెరంబూర్, ఫిబ్రవరి 7: స్థానిక చేపాక్కం క్రికెట్ మైదానంలో జరగనున్న రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌కు ప్రేక్షకులను ఉచితంగా అనుమతించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా తమిళనాడు - కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ఈ నెల 9 నుంచి 12వ తేది వరకు చేపాక్కం మైదానంలో జరగనుంది.

టీచర్లపై శాఖాపరమైన చర్యలు

పెరంబూర్, ఫిబ్రవరి 7: గత ఏడాది నిర్వహించిన పబ్లిక్ పరీక్షల మూల్యాంకన పనుల్లో నిర్లక్ష్యం చూపిన వెయ్యిమంది టీచర్లపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖకు ప్రభుత్వ పరీక్షల శాఖ సిఫారసు చేసింది. మూల్యాంకనంలో జవాబు పత్రాలను సరిగా దిద్దకపోవడం, మార్కుల గణింపులో నిర్లక్ష్యం తదితరాలకు పాల్పడ్డారని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో పరీక్షల శాఖ విచారణ చేపట్టి ఈ మేరకు సిఫారసు చేసింది. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో వీరిని పరీక్ష ఆర్గనైజర్లు, మూల్యాంకన పనులకు నియమించరాదని సూచించింది.

తాంబరంలో మరో ఆరు తూటాలు లభ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 7: స్థానిక తాంబరంలో బుధవారం ఉదయం మరో ఆరు తుపాకీ తూటాలు లభ్యమయ్యాయి. ఇవి ఏకే 47 తుపాకి నుంచి వచ్చిన తూటాలను పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఓ న్యాయవాది ఇంటిపై మంగళవారం సాయంత్రం తుపాకి తూటా దూసుకురావడంతో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టిన నేపథ్యంలో, బుధవారం ఉదయం ఈ ప్రాంతానికి కొద్ది దూరంలో మరో ఆరు తూటాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆ ప్రాంతంలో సమీపంలో ఉన్న సైనిక శిక్షణ కేంద్రంలో రైఫిల్ శిక్షణ సమయంలో ఈ తూటాలు పొరపాటున జనావాస ప్రాంతానికి దూసుకొచ్చాయా, మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

లంచం తీసుకున్న ఫోర్‌మెన్ అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 7: కరూర్ జిల్లా ఆట్పిమంగళంలో రూ.వెయ్యి లంచం తీసుకున్న విద్యుత్ బోర్డుకు చెందిన మురుగానందం అనే ఫోర్‌మెన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. ఆట్పిమంగళానికి చెందిన దినసరి కూలీ ఒకరు నిర్మించుకున్న ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.1500 లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, ఆయన రూ.1000 ఇచ్చేందుకు సమ్మతించాడు. ఆ తర్వాత ఈ విషయాన్ని ఆయన జిల్లా ఏసీబీ అధికారులకు చేరవేశాడు. వారు చెప్పినట్టుగా కూలీ నడుచుకోవడంతో మురుదానందంను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి, తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

కొత్త సచివాలయ వ్యవహారం అప్పీలు పిటిషన్ తీర్పు వాయిదా

ప్యారీస్, ఫిబ్రవరి 7: స్థానిక అన్నాసాలై ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలో నిర్మించిన కొత్త సచివాలయం వ్యవహారంలో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ తీర్పును మద్రాసు హైకోర్టు తేది ప్రకటించకుండా వాయిదా వేసింది. డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలో నిర్మించిన కొత్త సచివాలయం ప్రారంభించపడింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో, కొత్త సచివాలయం నిర్మాణంలో భారీస్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సమగ్రమైన విచారణ జరిపేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్, డీఎంకే మంత్రి దురై మురుగన్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు రద్దు చేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ గత ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును వెనక్కు తీసుకోనున్నట్లు డీఎంకే ప్రభుత్వం న్యాయస్థానంలో వివరించింది. ఈ కేసులో తనను కూడా చేర్చాలని కోరుతూ అన్నాడీఎంకే మాజీ ఎంపీ జయవర్ధన్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తులు సురేష్‌కుమార్, కుమరేశ్‌బాబుతో కూడిన ధర్మాసనం విచారణ జరపగా సీనియర్ న్యాయవాదులు హాజరై వాదించారు. అనంతరం అప్పీలు కేసు వెనక్కు పొందేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వ దాఖలు చేసిన పిటిషన్ ఉత్తర్వులను న్యాయస్థానం తేది ప్రకటించకుండా వాయిదా వేసింది.

పొలంలో తుపాకీ పేలి రైతుకు గాయాలు

ప్యారీస్, ఫిబ్రవరి 7: తిరువణ్ణామలై జిల్లా వందవాశి సమీపంలోని తేచూరు గ్రామంలో పొలంలో తుపాకీ పేలడంతో రైతుకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పెరుమాళ్ (35) అనే రైతు తన పొలంలో సేద్యం పనులు చేసే సమయంలో ఆ ప్రాంతంలో ఓ గోనెసంచి ఉండడం గమనించాడు. ఆ సంచిని పరిశీలించేటప్పుడు ఊహించని విధంగా అందులో తుపాకీ పేలి బుల్లెట్ పెరుమాళ్ ఎడమ కాలి తొడలోకి దూసుకెళ్లింది. సమాచారం తెలిసి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆయన్ను చెంగలపట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేచూరు విచారణ జరుపుతున్నారు.

పాళయంకోట జైలులో ఖైదీల ఘర్షణ

● ఒకరికి గాయాలు

ప్యారీస్, ఫిబ్రవరి 7: తిరునల్వేలి జిల్లా పాళయంకోట సెంట్రల్ జైలులో ఖైదీల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఒకరికి గాయాలైనట్లు జైలు అధికారులు తెలిపారు. ఈ జైలులో శిక్ష పొందిన, రిమాండ్ ఖైదీలు అని దాదాపు 1,200 మందికి పైగా బంధీలుగా ఉన్నారు. కులం పేరుతో ఖైదీలు తరచూ గొడవపడుతుంటారని, ఇటీవల ఓ హత్యకేసుతో సంబంధాలున్న ఖైదీపై దాడి జరిపిన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం రోజూలాగే ఖైదీలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న సమయంలో క్యూలో వేచి ఉన్న తూత్తుకుడికి చెందిన మరుదువేల్ అనే ఖైదీపై కొంతమంది ఖైదీలు దాడికి పాల్పడ్డారు. అడ్డుకొనేందుకు యత్నించిన ఖైదీలతో బాలసుబ్రమణియన్, సుందరమూర్తి అనే ఖైదీలు గొడవకు దిగారు. ఈ వ్యవహారంలో గాయపడిన మరుదువేల్‌ను జైలు అధికారులు పాళయంకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై విచారణ చేపట్టారు.

సైదై దురైస్వామి కుమారుడి మెదడు స్వాధీనం?

● డీఎన్ఏ పరీక్షలు

అడయార్, ఫిబ్రవరి 7: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నై మాజీ మేయర్ సైదై దురైస్వామి కుమారుడు సైదై వెట్రి (45) ప్రయాణిస్తున్న కారు సట్లెజ్ నదిలో దూసుకెళ్లిన విషయం విదితమే. కారుతో పాటు వెట్రి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గాలింపు చర్యల్లో కారుకు సంబంధించిన కొన్ని విడిభాగాలతో పాటు, మెదడును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన శరీర అవయవాలు, మృతదేహం కోసం ఆ రాష్ట్రానికి చెందిన గజ ఈతగాళ్లు, గిరిజన ప్రజలతో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన తన స్నేహితుడితో కలిసి వెట్రి తాను దర్శకత్వం వహిస్తున్న సినిమా కోసం లొకేషన్లు చూడడానికి హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లారు. ఆ సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు నియంత్రణ కోల్పోయి సట్లెజ్ నదిలోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడే ప్రాణాలు కోల్పోగా, వెట్రి స్నేహితుడు గోపినాథ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెట్రి ఆచూకీ మాత్రం ఇప్పటివరకు తెలియరాలేదు. దీంతో ఆయన ఆచూకీ చెప్పిన వారికి రూ.కోటి బహుమతి ఇస్తానని కూడా సైదై దురైస్వామి ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో బుధవారం మెదడును స్వాధీనం చేసుకున్నారు. దీనికి డీఎన్ఏ పరీక్షలు చేసి, ఈ మెదడు వెట్రిదా? కాదా? అని నిర్ధరించనున్నారు.

సినీ సంగీత దర్శకుడు విజయ్ ఆనంద్ మృతి

అడయార్, ఫిబ్రవరి 7: 'నాన్ అడిమై ఇల్లై' చిత్ర సంగీత దర్శకుడు విజయ్ ఆనంద్ (71) మృతి చెందారు. 1984లో విసు దర్శకత్వంలో వచ్చిన 'నాణయం ఇల్లాద నాణయం', రజనీ నటించిన 'నాన్ అడిమై ఇల్లై'తో పాటు 100కు పైగా చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేసిన ఆయన... గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రాగా, ఆయన మంగళవారం నగరంలోని ఆయన నివాసంలోనే మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

విద్యార్థినికి వేధింపులు

52 యేళ్ళ వ్యక్తి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 7: స్థానిక అరుంబాక్కంలోని ప్రభుత్వ పాఠశాలలో 11వ తరగతి విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధిస్తున్న 54 యేళ్ళ సుందర్‌రాజన్ అనే వ్యక్తిని నగర పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా సుందర్‌రాజన్ వేధింపులకు పాల్పడుతున్న నిర్ధారించుకుని అరెస్టు చేశారు. ఈయనను కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

ఎంజీఎం ఆసుపత్రి నిర్మాణంపై హైకోర్టు స్టే

పెరంబూర్, ఫిబ్రవరి 7: స్థానిక ఆళ్వార్‌పేటలో కొత్తగా నిర్మిస్తున్న ఎంజీఎం ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు మద్రాసు హైకోర్టు స్టే విధించింది. ఆసుపత్రి నిర్మాణ సమయంలో తీవ్ర శబ్దకాలుష్యం ఏర్పడుతోందంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, నిర్మాణ పనులకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జలాశయాల పునరుద్ధరణకు రూ.280 కోట్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: జలాశయాలు, కాలువల పునరుద్ధరణకు రూ.280 కోట్లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో గత ఏడాది డిసెంబరులో భారీవర్షాలు కురిశాయి. ఈ కారణంగా నదులు ఉప్పొంగగా, డ్యాంలు, జలాశయాల నుంచి భారీగా నీరు విడుదలైంది. దీంతో చోట్ల గట్లు, రెగ్యులేటర్లు, తూములు వంటివి ధ్వంసమయ్యాయి. వీటికి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ నిధులు మాత్రమే కాకుండా రామనాథపురం జిల్లాలో గుండారు కాలువలో 10 చోట్ల మరమ్మతులకు రూ.91 లక్షలు కేటాయించిందని అధికారులు తెలిపారు.

కోవలం బీచ్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 7: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెయింట్ జోసఫ్ మహోన్నత పాఠశాల సహకారంతో రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు బుధవారం కోవలం బీచ్‌లో ప్రారంభమయ్యాయి. 14, 17, 19 ఏళ్ల విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. తొలి రెండు రోజులు పురుషుల విభాగం, తరువాత రెండు రోజులు మహిళల విభాగం అని నాలుగు రోజులు పోటీలు జరుగుతాయి.

13 జిల్లాల్లో పెరిగిన భూగర్భ జలమట్టాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: ఈశాన్య రుతుపవన వర్షాలతో రాష్ట్రంలో 13 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ శాఖ ఆధ్వర్యంలో భూగర్భ జలమట్టాల తనిఖీ కేంద్రం ద్వారా ఇటీవల సర్వే జరిగింది. ఈ మేరకు జనవరిలో తంజావూరు, తిరువళ్లూర్, నాగపట్టినం, అరియలూరు, కోయంబత్తూర్, మదురై, రామనాథపురం, తేని, తూత్తుకుడి, తిరునల్వేలి, విరుదునగర్, తెన్‌కాశి, మైలాడుదురై జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయని పేర్కొన్నారు.

800 కోట్ల యూనిట్ల విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: రామనాథపురం జిల్లా కముదిలో ఉన్న సౌరశక్తి విద్యుత్ కేంద్రంలో 2016 నుంచి ఈ ఏడాది జనవరి వరకు 840 కోట్ల యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు తెలిపారు. గ్రీన్ ఎనర్జీ సంస్థకు 648 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ కేంద్రముంది. ఇక్కడ ప్రతిరోజు 30 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుండగా, 2.65 లక్షల గృహాలకు సరఫరా చేస్తున్నారు. విద్యుత్ కేంద్రం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 840 కోట్ల యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు తెలిపారు.

ప్రకటనలతో సరిపెట్టొద్దు.. ప్రజాక్షేత్రంలోకి వెళ్లండి

● హీరో విజయ్‌కు నిర్మాత రాజన్ సూచన

కొందరు వ్యక్తులతో రాజకీయ ప్రకటనలు చేయించి ఆ తర్వాత చేతులు దులుపుకోవద్దని, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజల సాధకబాధకాలను తెలుసుకోవాలని హీరో విజయ్‌కు సీనియర్ నిర్మాత కె.రాజన్ సూచించారు. విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరుతో పార్టీని స్థాపించడంపై రాజన్ పైవిధంగా స్పందించారు. లేఖా థియేటర్స్ పతాకంపై రాయల్ బాబు నిర్మాణ సారథ్యంలో 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సంగీత స్వరాలు సమకూర్చిన 1,417 చిత్రం 'నినైవెల్లాం నీయడా'. ప్రిజన్, మధుమిత, యువలక్ష్మి, సినామికా, కోమల్ శర్మ, రోహిత్ తదితరులు నటించారు. ఆదిరాజన్ దర్శకుడు. ఆడియో, ట్రైలర్‌ను మంగళవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ.. 'అగ్రహీరోగా ఉన్న విజయ్ రాజకీయ పార్టీని స్థాపించారు. చిత్రపరిశ్రమ తరఫున ఆయనకు అభినందనలు, శుభకాంక్షలు తెలుపుతున్నా. ఆయన రాజకీయాల్లో విజయం సాధించాలంటే మహానేత ఎంజీఆర్ చేసిన సేవలో కనీసం 15 శాతమైనా చేయాలి. ప్రజాక్షేత్రానికి వెళ్ళి వారితో మమేకం కావాలి. రూ.200 కోట్ల పారితోషికం వద్దని ప్రజల కోసం రాజకీయాల్లోకి వస్తున్నారంటే నిజంగానే విజయ్‌ను అభినందించాలి' అని అన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ.. 'నేను విజయ్‌కు విశ్వాసపాత్రుడిగానే ఉంటాను' అని అన్నారు. మరో దర్శకుడు ఆర్.వి.ఉదయకుమార్ మాట్లాడుతూ.. 'అన్ని రకాల ఎమోషన్స్‌కు సంగీతం అందించిన మేధావి ఇళయరాజా. ఇలాంటి ప్రేమకథలకు సంగీత సమకూర్చడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈ చిత్ర హీరోయిన్ యువలక్ష్మికి ఈ సినిమాలోని పాటల ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ఆదిరాజన్ మాట్లాడుతూ.. ఇళయరాజాతో కలిసి పనిచేయడం జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం' అని అన్నారు. 'ప్రసవానికి మూడు రోజులకు ముందు కూడా ఈ సినిమా కోసం పనిచేయడం మరిచిపోలేని అనుభూతి' అని నటి మధుమిత అన్నారు. సినీ గేయ రచయిత స్నేహన్ మాట్లాడుతూ.. 'కమర్షియల్ పాటలు నా చిరునామా కాదు' అని అన్నారు. అలాగే, నటి కోమల్ శర్మ, రెండో హీరోయిన్ సినామికా, రెండో హీరో రోహిత్, నటి యువలక్ష్మి, దర్శకుడు కేఆర్, హీరో ప్రిజన్ తదితరులు ప్రసంగించారు.


'నినైవెల్లాం నీయడా' మూవీ ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

దుల్కర్ సల్మాన్ హీరోగా 'లక్కీ భాస్కర్'


'లక్కీ భాస్కర్' ఫస్ట్‌లుక్

దుల్కర్ సల్మాన్ హీరోగా తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో 'లక్కీ బాస్కర్' పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. సితారా ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానరుపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. దుల్కర్ సన్మాన్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పుష్కరకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేసేలా హీరో కనిపిస్తున్నారు. దుల్కర్ హావభావాలు, ఆయన లుక్ డిజైన్.. సినీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. 80వ దశకం నాటి బాంబే నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతుందని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా ప్రకటన వెలువడినప్పటి నుంచి ఈ స్టోరీ సాదాసీదా మనిషి ప్రయాణం చుట్టూ తిరుగుతుందని అంటున్నారు. 80లో బాంబేలో ఆర్థిక సంక్షోభం తలెత్తిన సమయంలో ఒక క్యాషియర్ జీవితం గందరగోళంలోకి వెళ్తుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించే ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్.

ఫ్యాన్స్‌ను గందరగోళానికి గురిచేసిన కమల హాసన్

విశ్వనటుడు కమలహాసన్ చేసే ట్వీట్స్ లేదా పోస్టర్లు అభిమానులను గందరగోళానికి గురి చేస్తుంటాయి. ఈ కోవలోనే ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఓ పోస్టర్ ఉంది. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ హ్యాండిల్‌లో దీన్ని పోస్ట్ చేశారు. ఇందులో హీరోయిన్ శృతిహాసన్ - దర్శకుడు లోకేష్ కనకరాజ్ బ్లాక్ అండ్ వైట్‌లో కనిపిస్తుండగా, "ఇకపై మాయే పరిష్కారం. ఇదే బంధం.. ఇదే సంకటం... ఇదే మాయ' అంటూ పేర్కొన్నారు. ఈ పోస్టర్‌ను చూసిన కమల్ అభిమానులతో పాటు నెటిజన్లు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. శృతిహాసన్‌తో కలిసి లోకేష్ కనకరాజ్ నటిస్తున్నారా? లేక లోకేష్ కనకరాజ్ చిత్రంలో శృతి హాసన్ నటిస్తున్నారా? అనే సందేహం ఉత్పన్నమైంది. త్వరలోనే దీనికి ఓ క్లారిటీ లభించవచ్చని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.


శృతిహాసన్ - లోకేష్ కనకరాజ్

ఇస్మత్ బాను ప్రధాన పాత్రలో 'వెప్పం కులిర్ మళై'

హ్యాష్‌ట్యాగ్ ఎఫ్‌డీఎఫ్ఎస్ ప్రొడక్షన్స్ బ్యానరుపై తెరకెక్కుతున్న 'వెప్పం కులిర్ మళై' చిత్రంలో ధ్రువ్ హీరో. ఇస్మత్ బాను ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఈ మూవీ ద్వారా పాస్కల్ వేదముత్తు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సమాజానికి కుదిపేస్తున్న కథాంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఎంఎస్ భాస్కర్, ధ్రువ్, ఇస్మత్ బాను, రామా, మాస్టర్ కార్తికేయన్, దేవ్ హబీబుల్లా తదితరులు నటించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు పాస్కల్ వేదముత్తు వివరిస్తూ... ' వివాహిత జంటలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, సామాజిక చిక్కులు, మానసిక, శారీరక అస్థిరతను ఎలా సృష్టిస్తాయి అనే అంశాలతో ఈ సినిమా స్క్రిప్ట్ సాగుతుంది. మొదటి భాగం పూర్తిగా భావోద్వేగాల్లోని సూక్ష్మభేదాలను వివరిస్తుంది. ముఖ్యంగా ఇటీవల నేటి యువ జంటలు సంతానానికి జన్మనిచ్చే విషయంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం తదితర అంశాలతో రూపొందిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇందులో హీరో ధ్రువ్ గతంలో ఒక మ్యూజిక్ ఆల్బంలో నటించారు. సీనియర్ నటుడు ఎంఎస్ భాస్కర్ మరో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం శంకర్ రంగరాజన్.


'వెప్పం కులిర్ మళై'లో ఇస్మత్ బాను

చెన్నైలో గ్లోబల్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

అడయార్, ఫిబ్రవరి 7: నగరంలో గ్లోబల్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ప్రారంభమైంది. బహ్రెయిన్‌కు చెందిన గల్ఫ్ అకాడమీ సహకారంతో ఈ స్కూల్‌ను స్థాపించారు. స్థానిక ఎయిర్‌పోర్టు రోడ్డులో దాదాపు 8 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏవియేషన్ పరిశ్రమలో విజయవంతమైన కెరీర్ అవకాశాలు, ఔత్సాహిక విమానయాన ప్రియుల కోసం ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ స్కూల్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో అత్యాధునిక తరగతి గదులు, అంకితమైన శిక్షణ సౌకర్యాలు, అత్యాధునిక అభ్యాస అనుభవాన్ని అందించేందుకు అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో ఈ స్కూల్‌ను ప్రారంభించినట్టు గ్లోబల్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ప్రతినిధి సరిత, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యంగార్ తదితరులు వెల్లడించారు.

ఐనులో 'ఆండ్రాలజీ కేర్ విభాగం' ప్రారంభం


ప్రారంభోత్సవంలో వైద్య బృందం

అడయార్, ఫిబ్రవరి 7: దేశంలో అతిపెద్ద సింగిల్ స్పెషాలిటీ హాస్పిటల్ నెట్‌వర్క్‌ను కలిగిన ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఐఐఎన్‌యూ - ఐను) చెన్నై ఆస్పత్రిలో కొత్తగా ఆండ్రాలజీ కేర్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ విభాగాధిపతిగా విశేష అనుభవం కలిగిన ఫెలోషిప్, ట్రైన్డ్ సర్టిఫైడ్ మైక్రోసర్జికల్ ఆండ్రాలజిస్ట్ అండ్ యూరాలజిస్ట్ జె.సంజయ్ ప్రకాష్‌ను నియమించారు. ఈయన చెన్నైలో ఉండే ఏకైక సర్టిఫైడ్ ఆండ్రాలజిస్ట్ అని ఐను మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

పాండిచ్చేరి వర్సిటీలో 'జి-20 లైబ్రరీ సదస్సు' ప్రారంభం



జి-20 లైబ్రరీ సదస్సులో పుస్తకావిష్కరణ

పుదుచ్చేరి, ఫిబ్రవరి 7: పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలోని 'ది ఆనంద రంగ పిళ్లై' లైబ్రరీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 'జి-20 లైబ్రరీ సమ్మిట్' పేరుతో అంతర్జాతీయ సదస్సు బుధవారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దాదాపు 300 మందికిపైగా దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. జి-20 దేశాలను గ్రంథాలయాలతో అనుసంధానం, సహకరించాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహించాలన్న ఆలోచన ఆరు నెలల క్రితమే వచ్చింది. ఈ సదస్సును 82 దేశాల్లో దాదాపు 1.30 లక్షల మంది వీక్షించారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.తరణిక్కరసు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. వినియోగదారుల మధ్య సంక్లిష్టతలను తగ్గించడంలో లైబ్రేరియన్ల పాత్రను ఆయన విపులీకరించారు. యూనివర్సిటీ లైబ్రేరియన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.విజయకుమార్ స్వాగతోపన్యాసం పలికారు. రష్యాకు చెందిన ఆండ్రీ సోకోలోవ్, ఫ్రెంచ్ ఇనిస్టిట్యూట్ పాండిచ్చేరికి చెందిన ప్రొఫెసర్ బోరైస్ లారియోస్, కెన్యాలోని లుకెన్యా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కాన్‌స్టాంటైన్ మటోక్ న్యాంబోగా ఇందులో ప్రసంగించారు. ఇఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దేవిక మాదల్లి మాట్లాడుతూ... పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను గుణాత్మకంగా మెరుగుపరచడంలో డేటా ప్రధాన పాత్ర పోషిస్తున్నందున ప్రపంచవ్యాప్తంగా లైబ్రేరియన్లు ఓపెన్ డేటా రిపోజిటరీలను రూపొందించడానికి, నిర్వహించడానికి సహకరించాలని ఆమె కోరారు.

మద్రాసు వర్సిటీ తెలుగు శాఖ సాహితీ సేవలు ప్రశంసనీయం

● ధర్మనిధి ఉపన్యాసాల్లో వక్తలు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల కంటే మిన్నగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాహితీ కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తుండడం ప్రశంసనీయమని ఆ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ధర్మనిధి ఉపన్యాసాల ముగింపు సభలలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. మెరీనా రజతోత్సవ ప్రాంగణంలో బుధవారం మూడు ధర్మనిధి ఉపన్యాసాలు జరిగాయి. ఉదయం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రెప్కో బ్యాంక్ విశ్రాంత మేనేజర్ వంజరపు శివయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు శాఖ సేవలు ప్రశంసిస్తూ మరింత విస్తృతంగా సాహిత్య కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే, ములుమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆచార్యుడు చల్లా శ్రీరామచంద్రమూర్తి 'పోతన భాగవం - భక్తి మార్గాలు'పై వ్యాస, పోతన భాగవతాలకు ఉన్న తారతమ్యాలను వివరించారు. అనంతరం ఎన్.ఆర్.చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా ప్రధాన వక్తగా పాల్గొన్న ఆధునిక భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యుడు డాక్టర్ గంపా వెంకటరామయ్య 'తెలుగు సాహిత్యం - జర్నలిజం - నూతన ధోరణులు'పై విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ సోషల్ మీడియా ప్రభావాన్ని తెలియజేశారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం నాలుగో సమావేశంలో ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసం ప్రారంభమైంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజధాని కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఎం.అంబ్రూణి మాట్లాడుతూ తెలుగుశాఖ నిర్వహించే సాహితీ కార్యక్రమాలన్నీ వైవిధ్యంగా ఉంటున్నాయని ప్రశంసించారు.. అలాగే, ప్రధాన వక్తగా ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి 'గిరిజన నృత్యాలు - భాష, సాంస్కృతిక వికాసం'పై ప్రసంగించారు. చివరగా ధర్మనిధి ఉపన్యాసాల ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్యవిస్తాలి శంకరరావు మాట్లాడుతూ... ఆరు గురు ఉద్దండ పండితుల ఉపన్యాసాలు చక్కగా ఉన్నాయన్నారు. ముఖ్యఅతిథి, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ రెంటాల జయదేవ్ తెలుగు శాఖ పూర్వవైభవాన్ని, ధర్మనిధి ఉపన్యాసాల ఏర్పాటు తీరును అభివర్ణించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన తెలుగు బాషాభిమాని రేవూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ... మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు పాఠకులకు అత్యంత విలువైనవిగా ఉన్నాయన్నారు. ధర్మనిధి ముగింపు సందేశాన్ని అందించిన రాజధాని కళాశాల విశ్రాంతాచార్యుడు ఆచార్య ఎల్బీ శంకరరావు... ఈ ధర్మనిధి ఉపన్యాసాలు నేటి యువతకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మాదా శంకరబాబు స్వాగతం పలుకగా, ఎస్.శశికళ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. తెలుగు ప్రముఖులు గుడిమెట్ల చెన్నయ్య, గంధం అప్పారావు కుటుంబ సభ్యులు, ఆచార్య జీవీఎస్ఆర్ కుటుంబ సభ్యులు, డాక్టర్ ఏవీ శివకుమారి, ఆముక్తమాల్యాద, రాజధాని కళాశాల అధ్యాపకులు, ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్కాలర్లు పాల్గొన్నారు.


ధర్మనిధి ముగింపు సభలో ఆచార్యులు విస్తాలి శంకరరావు, ఎల్బీ శంకరరావు, రెంటాల జయవదేవ, రేవూరు నాగేశ్వరరావు



జాతీయ భౌతిక శాస్త్ర సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఉమ్మడి పరిశోధనలపై దృష్టి సారించండి

● ప్రొఫెసర్ ఉమేష్ వి వాగ్మారే పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు కలిసికట్టుగా పరిశోధనలు జరపాలని, అప్పుడే సత్ఫలితాల వస్తాయని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉమేష్ వి వాగ్మారే పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం టీపీ గణేశన్ ఆడిటోరియంలో జాతీయ భౌతికశాస్త్ర సదస్సు 2024 (ఎన్‌పీసీ 2024) ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఆ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం, నానో టెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు మూడు రోజులపాటు కొనసాగనుంది. ఆ సందర్భంగా ప్రొఫెసర్ ఉమేష్ మాట్లాడుతూ... శాస్త్రవేత్తల మధ్య సమన్వయ సహకారాలు పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. వీసీ సి.ముత్తమిళ్ సెల్వన్, ఎన్‌పీసీ 2024 కన్వీనర్ డాక్టర్ కిరణ్ మంగళంపల్లి, కోకన్వీనర్ ప్రొఫెసర్ పి.మలర్, ఎస్ఆర్ఎం వర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


త్వరలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అసెంబ్లీ హాలులో సదుపాయాలను పరిశీలిస్తున్న సీనియర్ మంత్రి ఏవీ వేలు, ఉన్నతాధికారులు

మత్తుపదార్థాల స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 7: స్థానిక మన్నడి, ట్రిప్లికేణి తదితర ప్రాంతాల్లో నగర పోలీసులు 40 గ్రాముల మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని మీరా సాహిబ్ (26), చెప్పాక్కంకు చెందిన అహ్మద్ (37), కొత్వాల్‌చావడికి చెందిన అజీస్ (30)లుగా గుర్తించారు. ఇతర రాష్ట్రాల నుంచి మత్తుపదార్థాలను సేకరించి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్న విచారణలో వెల్లడైంది. ఆ తర్వాత ఈ ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

చెన్నైలో జరిగిన మేనిఫెస్టో కమిటీ సమావేశంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రులు, నాయకులు



వీవీ పాట్‌లపై ప్రజలకు అవగాహన

పెరంబూర్, ఫిబ్రవరి 7: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో వీవీ పాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మండలాల వారీగా ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో నమూనా ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. అందులో, ప్రజలు ఈవీఎంలో ఓటు వేయడం, తాము ఎవరికి ఓటు వేశామో వీవీ పాట్‌లో తెలుసుకుంటుండగా, ఓటు నమోదులో ఏర్పడే సందేహాలను కార్పొరేషన్ అధికారులు నివృత్తి చేస్తున్నారు.



ఈడీ అధికారి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 7: లంచం తీసుకుంటూ అరెస్టయిన ఈడీ అధికారి అంకిత్ తివారి రిమాండ్‌ను ఈనెల 21వ తేది వరకు పొడిగిస్తూ దిండుగల్ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ వైద్యుడి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన ఈడీ అధికారి ప్రస్తుతం మదురై కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఆయన రిమాండ్ బుధవారంతో ముగియడంతో, జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, ఐదో సారి అంకిత్ తివారి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

మంత్రి సెంథిల్ బాలాజీకి కూడా....

చట్టవ్యతిరేక నగదు బట్వాడా కేసులో అరెస్టైన మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈనెల 19వ తేది వరకు చెన్నై సెషన్స్ కోర్టు పొడిగించింది. స్థానిక పుళల్ జైల్లో ఉన్న మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ బుధవారంతో ముగియడంతో ఆయన్ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, 19వ సారి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్ఐఏ విచారణకు హాజరైన నామ్‌తమిళర్ కట్చి ప్రముఖులు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు చెందిన నిషేధిత ఎల్టీటీఈ సహా విదేశాల్లోని పలు ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు సేకరిస్తున్నారనే ఆరోపణలపై ఇటీవల ఎన్ఐఏ అధికారుల సోదాలను ఎదుర్కొన్న ఆ పార్టీ ప్రముఖులు ముగ్గురు బుధవారం విచారణకు హాజరయ్యారు. పురుషవాక్కంలోని ఎన్ఐఏ కార్యాలయంలో నామ్ తమిళర్ కట్చికి చెందిన యూట్యూబర్ సాట్టై దురైమురుగన్, ఇసై మదివానన్, మురుగన్ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలాలు ఇచ్చారు.

పెంపుడు జంతువులకు మూలికా మందులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 7: చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ఇన్‌కాఫ్స్ సంస్థ మనుషులకు మాత్రమే కాకుండా జంతువులకు వివిధ రకాల మూలికా మందులు తయారు చేయనుంది. ఏనుగులు, పశువులు, శునకాలు, చేపలు, పిల్లలు, గుర్రాలు వంటి వాటికి మందుల తయారీకి పరిశోధనలు చేపట్టింది. త్వరలో ఇవి అందుబాటులోకి రానున్నాయని ఇన్‌కాఫ్స్ డైరెక్టర్ డాక్టర్ మీరా సుధీర్ తెలిపారు.

శ్రీలంక, బంగ్లాదేశ్‌లో సోకోమెక్ వాణిజ్య కలాపాల విస్తరణ

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లో ఓల్టేజీ పవర్ మేనేజ్‌మెంట్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన సోకోమెక్ ఇండియా సంస్థ శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో వాణిజ్య కలాపాలను విస్తరింపజేసిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మీను సింఘాల్ తెలిపారు. చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆసియా మార్కెట్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ఇంధన అవసరాలను తీర్చడంలో తమ సంస్థ అగ్రగామి ఉందన్నారు. చెన్నైలో ప్రధాన కార్యాలయం కలిగిన ఫ్రాన్స్ పవర్ సంస్థగా ఉన్న తమ సంస్థ ప్రపంచ నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి ఆత్మనిర్భర్, మేక్‌ఇన్ ఇండియా విధానాలను కూడా అమలు చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో సీఎఫ్ఓ దేవేష్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో సంస్థ ఎండీ మీను సింఘాల, సీఎఫ్ఓ దేవేష్ సింఘానియా తదితరులు